


RNI NO: APTEL No. 2005/17967

సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

గురువారం
23-07-2026
శ్రీకాకుళం

సంపుటి: 22
సంచిక: 104
పేజీలు: 8 వెల: రూ.1/-

Postal Regn.No: D/RNP/SKLM/12/2026-2028

https://www.satyamdaily.net




## శ్రీకాకుళం సుందరీకరణే లక్ష్యం



- మెరుగైన మున్సిపల్ సేవలకై నిరంతర పర్యవేక్షణ
- నగరపాలక సంస్థ కమిషనర్ జి.శ్రవణ్ కుమార్
- విస్తృత క్షేత్రస్థాయి తనిఖీలు.. పారిశుద్ధ్యం, రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక


2వ పేజీలో

అద్దెకు ఇవ్వబడును



సింహద్వారం దగ్గర కిమ్స్ రోడ్డులో రోడ్డుకు ఆనించి (ఎస్‌బీఐ ఎదురుగా) పైడి ఆదినారాయణ కాంప్లెక్స్ బిల్డింగ్ (మూడు ఫ్లోర్లు) ఒక ఫ్లోర్ 2400X3=7200 అడుగులు
అద్దెకు ఇవ్వబడును
- సంప్రదించగలరు -
94411 59190, 95736 38190

## 24న శ్రీ సంతోషిమాత జయంతి మహోత్సవం



- ప్రీతికరమైన శుక్రవారం నాడే జయంతి రావడం విశేషం
- 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, చండీహోమం, ఆయుష్య హోమాలు
- భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో పిలుపు

2

### గత ప్రభుత్వ అక్రమాలు

## ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయ్



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అధికార దుర్వినియోగం, భూ ఆక్రమణలు, అక్రమ ఆస్తుల పాపాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో వెలిగిన కొందరు నాయకులు ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులను సైతం గాలికొదిలేశారని ఎమ్మెల్యే శంకర్

- మిగతా చివరి పేజీలో

- బీఎన్‌ఎస్ 105 చుట్టూ ముదురుతున్న వివాదం
- పలాస పోలీస్‌స్టేషన్‌లో ఇంకా కొనసాగుతున్న హైడ్రామా
- మంత్రిగా ఉన్నప్పుడు శిరీషను వేధించిందీ తక్కువేం కాదు
- త్యాడీ పేరుతో కేసు ముగింపు నుంచి సీసీటీవీ ఫుటేజ్ లీక్ వరకు... అసలు నిజాలు తేలేది కోర్టులోనే!



## సీదిరి అరెస్టులో చట్టం ఎంత? రాజకీయం ఎంత?

**(సత్యంన్యూస్, పలాస)**

మాజీమంత్రి సీదిరి అప్పలరాజును అరెస్ట్ చేసిన తర్వాత కూడా పలాస పోలీస్‌స్టేషన్‌లో ఇంకా హైడ్రామా కొనసాగుతోంది. బుధవారం రాత్రి 7 గంటలకు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన తర్వాత గురువారం మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఆయన్ను విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటూ పరిసర ప్రాంతాల్లోకి ఎవర్నీ అనుమతించలేదు. అప్పలరాజు పెద్ద కొడుకు ఆరవ్ వర్మ పది రోజుల క్రితం పలాస జాతీయ రహదారిపై చేసిన యాక్సిడెంట్‌లో సాక్ష్యాలు తారుమారు చేయడానికి అప్పలరాజు ప్రయత్నించారన్న అభియోగంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో తండ్రీకొడుకులిద్దరి మీద భారత న్యాయసంహిత (బీఎన్‌ఎస్)లో సెక్షన్ 105 కింద ఎఫ్ఐఆర్ నమోదైనట్లు గురువారం ఆంధ్రజ్యోతి పేర్కొంది. అప్పలరాజు అరెస్టు, ఆయన తనయుడు రిమాండు వంటి అంశాలపై కంటే సెక్షన్ 105నే వైకాపా వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పాత ఐపీసీ 304 సెక్షన్ స్థానంలో వచ్చిన బీఎన్‌ఎస్‌లో 105 ప్రకారం మానవ హననానికి పాల్పడితే ఈ సెక్షన్‌ను వర్తింపజేస్తారు. ఇందులో పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నందున స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం లేదు. అదే సమయంలో పోలీసులు కూడా వారెంట్ లేకుండా అరెస్టు చేయొచ్చు. నాన్ బెయిలబుల్ కేసు కావడంతో కోర్టుకు వెళ్లినా అప్పలరాజుకు అందుకే ఉపశమనం

- మిగతా చివరి పేజీలో




## ట్రిపుల్ మర్డర్‌కు ఏఐ సహకారం!

**ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) జమానా నడుస్తోంది. ప్రస్తుతం అది సర్వాంతర్యామిగా వ్యవహరిస్తున్నది. లెటర్ రాయాలన్నా.. ఒక భాష నుంచి మరో భాషలోకి ట్రాన్స్‌లేట్ చేయాలన్నా.. ఏదైన సమస్యపై సలహా కావాలన్నా.. ఏదైనా పని చేసిపెట్టాలన్నా ఏఐ సై.. సై.. అంటున్నది. మనం కూడా సొంత సృజనను పక్కనపెట్టేసి.. ప్రతిదానికీ ఏఐపైనే ఆధారపడటానికి క్రమంగా అలవాటు పడిపోతున్నాం. అయితే ఒక విషయం వింటే మాత్రం.. ఏఐ ఇలాంటి పనులు కూడా చేస్తుందా? నేరాలు చేసేందుకు, వాటి నుంచి తప్పించుకునేందుకు కూడా ఐడియాలు ఇస్తుందా?? అని విస్మయం చెందడం మనవంతు అవుతుంది. ఎందుకంటే సంచలనం సృష్టించిన ఒక ట్రిపుల్ మర్డర్ విషయంలో ప్రధాని నిందితుడికి ఏఐ చాట్‌బాటే వెన్నంటి ఉండి సలహాలతో ముందుకు నడిపింది. నేర నియంత్రణలో పోలీసులకు, నిఘావర్గాలకు సహాయపడుతున్న ఈ అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ ఇలా నేరాలకు కూడా దన్నుగా నిలవడం బహుశా ఇదే తొలిఘటనేమో!**

**(డి.వి.రమణ, సత్యం ప్రత్యేకప్రతినిధి)**

ఆవేశంలో చేసే నేరాలను పక్కనపెడితే కావాలని ప్లాన్ ప్రకారం చేసే ప్రతి నేరం వెనకా కచ్చితంగా ఎవరో ఒకరు మాస్టర్‌మైండ్‌గా ఉంటారు. ఆ మాస్టర్‌మైండ్ ప్లాన్‌ను ఆచరణలో పెట్టడానికి నమ్మకమైన అనుచరులో, స్నేహితులో, కుటుంబ సభ్యులను తోడుతీసుకుంటారు. కానీ ఇప్పుడు మనం చెప్పుకొనే నేరఘటనలో ఏఐ మాస్టర్‌మైండ్‌గా వ్యవహరిస్తే.. ప్రధాన నిందితులు దాన్ని అనుసరించారు. ఫలితంగా బెంగళూరు నగరంలోని కృష్ణరాజపురం (కేఆర్‌పురం) పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు నెలరోజుల క్రితం ఒకే ఇంట్లో మూడు హత్యలు జరిగాయి. అదుపులోకి తీసుకున్న నిందితులిద్దరినీ విచారించినప్పుడు నేరం చేయడానికి, తప్పించుకోవడానికి ఏఐ చాట్‌బాట్ సలహాలు తీసుకున్నట్లు వారు వెల్లడించడం పోలీసులనే నివ్వెరపర్చింది.

**సొంత కుటుంబం అంతం**

సమాజంలో పెరుగుతున్న లివ్ ఇన్ రిలేషన్‌షిప్( సహజీవనం) బంధాలు సహజసిద్ధమైన కుటుంబ బంధాలను కూడా అంతం చేసే స్థాయికి మనల్ని పతనం చేస్తున్నాయి. బెంగళూరులోని కేఆర్‌పురం ప్రాంతంలో

- మిగతా చివరి పేజీలో

## నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో నిర్వహించిన మహా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ మేళాకు 2,376 మంది హాజరవ్వగా టెక్ మహీంద్రా, క్యాప్ జెమినీ సహా 52 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. కార్యక్ర మంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఉరిటి సాయికుమార్, శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ శ్రీధర్‌లు పాల్గొన్నారు.



### వణుకుతోంది పసిపిల్లలు కాదు...

## ఆ కుర్చీల్లో కూర్చున్న పెద్దలే




- బొద్దింకలకెందుకింత మద్దతు?
- కమలాన్ని కలవరపెడుతున్న కాక్రోచ్
- దేశాన్ని దారిలో పెట్టుకోవాలన్న ఆలోచనకు హ్యాట్సాఫ్

*మూతికి ఖర్చీఫ్ కూడా సరిగ్గా కట్టుకోకుండా తమ మధ్య వచ్చి పడిన టియర్ గ్యాస్ షెల్‌ని ఉన్న పళంగా చేతిలోకి తీసుకుని దూరంగా విసిరేసి పోతాడు ఒక యువకుడు, చుట్టూ కమ్ముకుంటున్న ప్రశంసలని నవ్వుతూ జేబులో వేసుకుని...*

*పోలీసుల ఎత్తులో సగం కూడా లేని ఓ పసిమొహం అమ్మాయి వారి మీదికి సివంగిలా ఎగిరి దూకుతూ కాలర్ పట్టుకుని మరీ నిలదీస్తుంది...*

*పోలీసులతో బూటుకాళ్ల దెబ్బలు తిన్న యువకుడు అతి కష్టం మీద లేచి నిలబడి సందు చూసుకుని ఆ పోలీసుకి ఒక చెంప దెబ్బ ఇచ్చి మెలికెలు తిరుగుతూ తుపాకి గుండుకి దొరక్కుండా పారిపోతాడు...*

*మొహాల మీద తారాడుతున్న మీడియా మైక్‌ని గొప్ప తిరస్కారంతో ఎడంచేత్తో విసిరికొడుతుంది ఓ పౌరుషవంతురాలు..*

*కొట్టి కొట్టి అలిసిపోయి సొగిల పడి కూచున్న పోలీసులకి ఫుడ్ ఆఫర్ చేస్తూ పెళ్లివారి మర్యాదలు తలపిస్తారు కొందరు యువకులు...*

దండాలు పెడతారు, పూలిస్తారు, కొడుతున్నా కౌగిలించుకుంటారు, ఒకరి చేయి మరొకరు విడవకుండా పట్టుకుంటారు. ఈ పిల్లలు అనుకున్నది సాధించగలరో లేదో తెలీదు. కోట్ల హృదయాలను మాత్రం సాధించుకున్నారు. మాటిమాటికీ తడవుతున్న

- మిగతా చివరి పేజీలో

## మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో తిలక్ నిర్బంధం..!

### భారీగా తరలివచ్చిన వైకాపా శ్రేణులు

**(సత్యంన్యూస్, మెళియాపుట్టి)**

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గ వైకాపా నాయకుడు పేరాడ తిలక్‌ను పోలీసులు మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించినట్లు వైకాపా నాయకులు ఆరోపించారు. పార్టీ నాయకుల కథనం ప్రకారం, మాజీ మంత్రి అప్పలరాజు అరెస్టు, అనంతరం ఆయనను పరామర్శించేందుకు పలాస వెళ్లిన తిలక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, రాత్రి సుమారు 9 గంటల సమయంలో రహస్యంగా మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తొలుత బయటకు రాకపోవడంతో పార్టీ శ్రేణులు రాత్రంతా ఆందోళనకు గురయ్యాయి. ఉదయం తిలక్ మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో ఉన్నారనే సమాచారం అందడంతో వైకాపా నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున అక్కడికి చేరుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడు చల్లా రవికుమార్, జిల్లా స్థాయి నాయకులు, టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తిలక్‌ను పరామర్శించారు. తిలక్‌ను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



• ఎడిటోరియల్

# ధర్మేంద్రుడి ముందంతా ముళ్లబాటే!

దేశమంతా ఇప్పుడు ఒకే అంశం చుట్టూ తిరుగుతున్నది. అదే కాక్రోచ్ జనతా పార్టీ.. ఆ పార్టీ చేపట్టిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్. ఈ డిమాండ్‌తో గత కొన్నిరోజులుగా లడ్డాఖ్‌కు చెందిన సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండగా, ఆయన్ను బలవంతంగా ఆస్పత్రికి తరలించడం, దానికి నిరసనగా కాక్రోచ్ జనతాపార్టీ ఛలో పార్లమెంటు ఉద్యమానికి పిలుపునివ్వడం, దేశంలోని చాలా ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో తరలిరావడం, ఆ సందర్భంగా ఢిల్లీ పోలీసులు, ఆందోళనకారుల మధ్య జరిగిన తోపులాటలు, లాఠీఛార్జీల్లో రెండువైపులా అనేకమంది గాయపడటంతో ఈ వివాదం మరింత బిగుసుకున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పక్షాలు కూడా కాక్రోచ్ ఉద్యమంలోకి రంగప్రవేశం చేయడంతో రాజకీయ రంగు కూడా పులుముకుంది. మరోవైపు ప్రశ్నపత్రాల లీకేజీ ఘోర పాపమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించగా, ఆందోళనకారులతో చర్చలకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులోనే ప్రకటించింది. అయితే ఆందోళన శిబిరం లేదా ఏదైనా తటస్థ వేదికలపై చర్చలు జరపాలని, ప్రభుత్వ వేదికల్లో అయితే తమకు సమ్మతం కాదని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చలు ముందుకెళ్తాయని బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే కుండబద్దలు కొట్టేశారు. ఇంత జరుగుతున్నా మంత్రి రాజీనామా విషయంలో మాత్రం కేంద్రం తన వైఖరిని ఇంతవరకు వెల్లడించలేదు. ఈ డిమాండ్‌పై మౌనం వహిస్తున్నదంటే ఆయన్ను సాగనంపేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఎందుకు అంత ప్రాధాన్యం ఇస్తూ.. రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితుల్లోనూ ఆయనన్ను మంత్రి పదవి నుంచి తప్పించేందుకు ఎందుకు సుముఖత చూపడంలేదన్న చర్చ మొదలైంది. మంచి వ్యూహకర్తగా పేరున్న ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రం ఒడిశా. బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందిన తాల్చేరులో జన్మించారు. ఆయనది తొలినుంచి బీజేపీ కుటుంబమే. తండ్రి దేవేంద్ర ప్రదాన్ పార్టీ సీనియర్ నాయకుడిగా వ్యవహరించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా కూడా పని చేశారు. రాజకీయాలను తండ్రి నుంచి వారసత్వంగా అందుకున్నప్పటికీ ధర్మేంద్ర ప్రదాన్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)లో పని చేసి అక్కడి నుంచి బీజేపీ యువమోర్చాలోకి, తద్వారా బీజేపీలోకి ప్రవేశించి క్రమంగా ఉన్నతస్థాయికి ఎదిగారు. 2004లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికైన ఆయన పార్టీ జాతీయ కార్యవర్గంలో అనేక పదవులు నిర్వహించి వ్యూహ నిపుణత, సమర్థతతో తన స్థానాన్ని బలపరచుకుంటూ వచ్చారు. అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించి విజయానికి బాటలు వేశారు. 2014లో మోదీ నేతృత్వంలో ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వంలో తొలిసారి మంత్రి అయ్యారు. అప్పటినుంచి కేంద్ర కేబినెట్‌లోనూ పార్టీలోనూ కీలకంగా ఉన్న ఆయన 2021లో విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు. 2024 ఎన్నికల అనంతరం ఏర్పడిన మోదీ సర్కారులో కూడా అదే పోర్టుఫోలియో నిలబెట్టుకున్నారు. జాతీయ విద్యావిధానం రూపకల్పనతో పాటు విద్యారంగ సంస్కరణల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ తరుణంలో కొన్ని నెలల క్రితం జరిగిన నీట్ పరీక్షకు ముందే ప్రశ్నపత్రాలు లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడం, పరీక్ష రద్దు కావడంతో.. ఆ వైఫల్యాలన్నీ సంబంధిత మంత్రిగా ధర్మేంద్ర ప్రదాన్ మెడకు చుట్టుకున్నాయి. ఆయన రాజకీయ జీతంలోనే పెద్ద సవాల్‌గా పరిణమించాయి. నీట్ నిర్వహణలో లోపాలకు, వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం మాత్రం బాధ్యులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నదే తప్ప మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌పై స్పందించడం లేదు. దీనికి కారణం ధర్మేంద్ర ప్రధాన్ బీజేపీ కీలక వ్యూహకర్తల్లో ఒకరు కావడమే. పార్టీ సంస్థాగత వ్యవహారాలతో పాటు ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో ఆయనకు ఉన్న అపార అవగాహన, వ్యూహనైపుణ్యాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకత్వం ఆయన్ను వెనకేసుకు వస్తున్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన నాయకుడైనప్పటికీ ఆయన సమర్థతను గుర్తించిన పార్టీ జాతీయస్థాయిలో ఆయన సేవలను ఉపయోగించుకుంటున్నది. మోదీ–షా ద్వయానికి అతి సన్నిహితంగా ఉండే నాయకుల్లో ఆయన ముందువరుసలో ఉంటారు. అందుకే నీట్ వివాదంలో ప్రతిపక్షాల నుంచి, కాక్రోచ్ ఉద్యమరూపంలో, జాతీయస్థాయిలో జరుగుతున్న ఆందోళనల రూపంలో ఎంత ఒత్తిడి పెరుగుతున్నా పార్టీ నాయకత్వం ఆయనకు అండగా నిలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో ధర్మేంద్ర ప్రదాన్ పరిస్థితి ముళ్ల మీద ఉన్నట్లుగా తయారైంది. పార్టీ నాయకత్వం తన పట్ల సడలని నమ్మకంతో అండగా నిలవడంతో మంత్రి పదవిని కాపాడుకోగలిగినప్పటికీ.. ప్రస్తుత సవాళ్లను అధిగమించి ముందుకు సాగడం ఆయనకు కత్తిమీద సాములా మారనుంది. దేశప్రజలకు హామీ ఇచ్చినట్లు నీట్ లీకేజీ దోషులను చట్టప్రకారం శిక్షించాల్సి ఉంది. అదే సమయంలో ఆ పరీక్షల వ్యవస్థను సమూలంగా సంస్కరించాల్సిన బాధ్యత కూడా ఆయనదే. దాంతోపాటు జాతీయస్థాయిలో జరిగే అన్ని రకాల పరీక్షల వ్యవస్థల్లోనూ భవిష్యత్తులో లీకేజీలకు ఆస్కారం లేకుండా పూర్తిగా సంస్కరించాల్సిన అవసరం ఉంది. వీటన్నింటినీ కఠినమైన సవాళ్లుగానే మేథావులు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. కోట్లాది విద్యార్థులు, యువతలో సన్నగిల్లిన నమ్మకాన్ని తిరిగి పొందడం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. అలాకాకుండా ఒత్తిడి పెరిగి మంత్రి పదవి కోల్పోతే కొన్నాళ్ల పాటు ప్రదాన్‌కు రాజకీయ వనవాసం తప్పదేమో!

## 24న శ్రీ సంతోషిమాత జయంతి మహోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర ప్రజల నిత్య పూజలందుకొనే ఇలవేల్పు శ్రీ సంతోషి మాత అమ్మవారి జయంతి మహోత్సవాలు పాత శ్రీకాకుళంలోని దేవస్థానంలో ఈ నెల 24న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన శుక్రవారం రోజే ఈ ఏడాది జయంతి మహోత్సవం రావడంతో ఉత్సవాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో రోజంతా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, మహా గణపతి పూజ, అమ్మవారికి 108 లీటర్ల పాలతో ప్రత్యేక క్షీరాభిషేకం, మహిళలతో విశేష కుంకుమ పూజలు, లోకకళ్యాణార్థం చండీహోమం, ఆయుష్య హోమాలు, మహా పూర్ణాహుతి, నైవేద్య సమర్పణ, మహా హారతి తదితర కార్యక్రమాలు జరుపనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ సిద్ధాం వేద మంత్రాల మధ్య, శాస్త్రోక్తంగా ఈ వేడుకలు నిర్వహించబడుతున్నాయని ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి దర్శనం చేసుకుని కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

## ఎంజీహెచ్ఎస్‌లో హిందీ ప్రాముఖ్యతపై అవగాహన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణంలోని ఎంజీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ భాష అయిన హిందీ ప్రాముఖ్యతను వివరించేందుకు గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. దైనందిన జీవితంలోనూ, భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల సాధనలో హిందీ భాషా పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులకు స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరిశీలించేందుకు గాను ప్రత్యేక పరీక్షను నిర్వహించగా, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. హిందీ భాషా వికాస్ సంస్థ అధ్యక్షులు సూరంపల్లి బ్రహ్మాజీ, ఎంజీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, హిందీ ఉపాధ్యాయినులు కళ్యాణి, ఉష పాల్గొని విద్యార్థులకు తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీకాకుళం సుందరీకరణే లక్ష్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా నగరపాలక సంస్థ కమిషనర్ జి.శ్రవణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేపట్టారు. గురువారం ఉదయం నగరంలోని పలు ప్రధాన వీధులు, కాలనీలలో పర్యటించిన ఆయన.. పారిశుధ్య పరిస్థితులు, డ్రైనేజీ నిర్వహణ, రహదారుల విస్తరణ పనులు, పౌర మౌలిక సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా కమిషనర్ నగరంలోని కీలక ప్రాంతాలైన వరం కాలనీ, హోమియో నగర్, హోమియో నగర్ 1వ లేన్, వరం కాలనీ పార్క్, షిర్డీ సాయి నగర్, మిర్తి బత్తి ఏరియా, డే & నైట్ జంక్షన్ పింక్ టాయిలెట్స్, బుచ్చిపేట రోడ్డు విస్తరణ పనులు, గూనపాలెం రాజీవ్ పార్క్, కార్గిల్ పార్కులను సందర్శించి స్థానిక స్థితిగతులను అంచనా వేశారు.

**శాఖల వారీగా కమిషనర్ ఆదేశాలు:**

✷వరం కాలనీ, హోమియో నగర్, షిర్డీసాయి నగర్ పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీలను తనిఖీ చేశారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగు కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేసి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

✷రాజీవ్ పార్క్, కార్గిల్ పార్క్, వరం కాలనీ పార్కులను పరిశీలిస్తూ.. పచ్చదనాన్ని పెంపొందించడం, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టడం, విరిగిన ఆట పరికరాలను తక్షణమే బాగు చేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు ద్వారా సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను సూచించారు.

✷డే & నైట్ జంక్షన్ వద్ద ఉన్న పింక్ టాయిలెట్లలో నీటి సరఫరా, పరిశుభ్రతను పరిశీలించారు. మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిరంతర నీటి సదుపాయం, శుభ్రత ఉండాలని ఆదేశించారు.

✷కొనసాగుతున్న రహదారి విస్తరణ ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్దేశిత గడువులోగా విస్తరణ పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పౌరులకు మెరుగైన సేవలందించడమే మున్సిపల్ యంత్రాంగ ప్రాథమిక బాధ్యతన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, నగరంలో పారిశుధ్యం, పౌర సౌకర్యాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇటువంటి క్షేత్రస్థాయి తనిఖీలు ఇకపై కూడా రోజూ కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ పి.ఎం.జె.బాబు మాట్లాడుతూ షిర్డీ సాయినగర్, సత్యసాయినగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు మున్సిపల్ ఇంజనీరింగ్, ప్రజారోగ్య (పబ్లిక్ హెల్త్), టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## యువతను సమాజ సేవలో
# భాగస్వాములను చేయడమే లక్ష్యం




✭ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కన్నంనాయుడు

✭పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'యూత్ క్లబ్ డెవలప్‌మెంట్ కాంపెయిన్'

(సత్యంన్యూస్, పాతపట్నం)

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో యూత్ క్లబ్ డెవలప్‌మెంట్ కాంపెయిన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కన్నంనాయుడు మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతను ఒకే తాటిపైకి తెచ్చి వారిలోని నైపుణ్యాలను పెంపొందించడానికి, సమాజ సేవలో భాగస్వాములను చేయడానికి ఈ ప్రచారం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు ఎన్.ఎస్.ఎల్.తిరుమలరావు యువతలోని డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధిపై శిక్షణ, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, గ్రామాల పరిశుభ్రతా కార్యక్రమాలు, కంప్యూటర్ అవగాహన తరగతులు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఆంగ్ల అధ్యాపకులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆటలు, సాంస్కృతిక పోటీల ద్వారా ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ జాతీయ యువ కార్యకర్తలు యర్ర పద్మ సాయి, కొల్లి బాలసాయి, పడాల అజిత్ కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీదిరి అప్పలరాజు కుటుంబంపై
# వేధింపులు తగవు



●అక్రమ అరెస్టులతో ఎన్డీయే ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు

●చట్టం అందరికీ సమానమే.. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

●వైకాపా జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు ఆరంగి లక్ష్మీపతి

(సత్యంన్యూస్, పలాస)

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబంపై, వైకాపా నాయకులపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం అతిగా ప్రవర్తిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని వైకాపా జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు, మాజీ అడిషనల్ అండ్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరంగి లక్ష్మీపతీ తీవ్రంగా మండిపడ్డారు. మాజీ మంత్రి కుమారుడు సీదిరి అరవ్ ప్రమాదం చేశారన్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ.. ప్రమాదం దురదృష్టకర సంఘటన అని, ఈ ఘటనపై బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ సంఘటనను సాకుగా చూపి కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరు ఒక మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తన అనుభవం సిగ్గుపడేలా ఉందన్నారు. టెక్కలి నియోజకవర్గం నాయకులు పేరాడ తిలక్ అప్పలరాజు కుటుంబానికి సానుభూతి తెలపడానికి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు రాత్రి 9 గంటలకు వెళ్లారని, ఎటువంటి సమాచారం అనుచరులకు లేదా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా ఆయనను రాత్రికి రాత్రే మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. ఈ రకమైన అక్రమ నిర్బంధానికి బాధ్యులు ఎవరని ఆయన నిలదీశారు. చట్టం ముందు అందరూ సమానమేనని విశ్వసిస్తున్నానని, రాజ్యాంగం గౌరవించే వృత్తే తన జీవనాధారమని లక్ష్మీపతీ పేర్కొన్నారు. సీదిరి కుటుంబానికి ప్రజల మద్దతుతో పాటు న్యాయస్థానాల ద్వారా కచ్చితంగా న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైకాపా నాయకులపై జరుగుతున్న అక్రమ నిర్బంధాలకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యల కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కాలుష్యకారక సరుకుల రవాణాను
# ఉపసంహరించుకోవాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మూలపేట పోర్టు ద్వారా కాలుష్యకారక సరుకుల రవాణా చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సీపీఎం జిల్లా నాయకత్వం తీవ్రంగా ఖండించింది. గురువారం శ్రీకాకుళంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కోనారి మోహనరావు మాట్లాడారు. విశాఖ పోర్టులోని కాలుష్యకారక కార్గోను మూలపేటకు తరలిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ ప్రకటించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆదానికి లాభాలు చేకూర్చేందుకు బీజేపీ–టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. బొగ్గు, ఐరన్ ఓర్ వంటి సరుకుల వల్ల పలాస నుంచి టెక్కలి వరకు వాయు కాలుష్యం పెరిగి ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ ప్రమాదం ఉందని, వ్యవసాయం, తీరప్రాంత పర్యావరణం దెబ్బతింటాయని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పర్యావరణానికి హానిలేని సరుకులనే రవాణా చేయాలని, మూలపేట పోర్టును ప్రభుత్వ రంగంలోనే నిర్వహించి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రణస్థలం ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

(సత్యంన్యూస్, న్యూఢిల్లీ)



శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జాతీయ రహదారిపై మందకొడిగా సాగుతున్న ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. పనుల ఆలస్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి విజయవాడ ఆర్వోతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## వైసీపీ అక్రమాలపై చర్యలు తప్పవు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై చర్యలు తప్పవని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మెట్ట సుజాత హెచ్చరించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కేసుల మాఫీకి తీవ్ర ప్రయత్నాలు జరిగాయని, అందులో భాగమే తమ్మినేని సీతారాం ఉదంతమని పేర్కొన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబుల హయాంలో ఎంతో మచ్చలేకుండా ఉన్న తమ్మినేని, వైకాపాలో చేరి సైకో సంస్కృతినే అలవర్చుకున్నారని ధ్వజమెత్తారు. సీదిరి అప్పలరాజు అరెస్టును వైకాపా నేతలు అనవసరంగా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని గీత, సనపల డిల్లేశ్వరరావు, కె. విజయలక్ష్మి, సంపదరావు మురళీధర్ రావు పాల్గొన్నారు.











# జీవో 396ను రద్దు చేయాలి

**(సత్యంన్యూస్, పాలకొండ)**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలకొండలో డాక్యుమెంట్ రైటర్లు గురువారం నాలుగో రోజు కూడా పెన్‌డౌన్ నిరసన కొనసాగించారు. గత నాలుగు రోజులుగా విధులను బహిష్కరిస్తూ ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ జీవో అమలు వల్ల తమ ఉపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీవోను ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంఘ ప్రతినిధులు కొండదాడి రఘుకుమార్, కరణం ప్రభాకర్, నీలాపు మన్మధరావు, అలజంగి శంకర్రావు, రాజాం పవన్ కుమార్, గుమ్మడి జనార్దన్‌రావు, కొట్టిశ రమప్రసాద్, వై.ఎస్.ఆర్. పాత్రో, వన్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తరాంధ్ర ప్రగతికి 'భోగాపురం' బాట

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ, ప్రాంతీయ అభివృద్ధికి నూతన బలాన్ని ఇచ్చే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభం కానుండటం ఈ ప్రాంత చరిత్రలోనే ఒక స్వర్ణాక్షర ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి ఫలితంగానే ఈ చారిత్రక ప్రాజెక్టు కల రూపుదిద్దుకుందని కొనియాడారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని, భారీగా పెట్టుబడులు తరలి రావడంతో పాటు ఐటీ, పర్యాటక, పారిశ్రామిక, సేవా రంగాలు శరవేగంగా విస్తరించి వేలాదిమంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. పోర్టులు, జాతీయ రహదారులకు తోడు భోగాపురం ఎయిర్‌పోర్టు జతకూడటంతో ఉత్తరాంధ్ర దేశంలోనే వేగవంతమైన అభివృద్ధి ప్రాంతంగా అవతరిస్తుందన్నారు. ఇది కేవలం ఎయిర్‌పోర్టు ప్రారంభం మాత్రమే కాదని, ప్రజల ఆశయాలు నెరవేరిన మహత్తర విజయమని పేర్కొంటూ.. ఈ పండుగ వాతావరణాన్ని ఉత్తరాంధ్రులందరూ గర్వంగా స్వాగతించాలని పిలుపునిచ్చారు.

# అక్రమ అరెస్టులతో నిజాల గొంతులు నొక్కలేరు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం దారుణమని డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ప్రసాదించిన మాట్లాడే హక్కును, స్వేచ్ఛను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు మద్దతుగా శాంతియుత నిరసన చేపట్టిన తమ నాయకుడు రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఖండించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక వరుస పేపర్ లీకులతో యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిందని, ఎంతోమంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో దేశ ప్రజలే బీజేపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# సీదిరి అరెస్టుపై మండిపడ్డ ధర్మాన కృష్ణదాస్

**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు పలాస బయలుదేరిన వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌ను నరసన్నపేటలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అంతకుముందు నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని, ప్రమాద ఘటనలో చట్టానికి సహకరించిన సీదిరిపై ఉద్దేశపూర్వకంగా హత్య కేసు నమోదు చేశారని విమర్శించారు. నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం హరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అనుమతి లేదంటూ పోలీసులు తన కాన్వాయ్‌ను అడ్డుకున్నప్పటికీ, ఆంక్షలను అధిగమించి సుమారు 30 వాహనాలతో పలాసకు పయనమయ్యారు. ఎంతమందిని అరెస్టు చేసినా తమ పోరాటాన్ని ఆపలేరని వైకాపా శ్రేణులు స్పష్టం చేశాయి.



# పోరాట స్ఫూర్తిదాతలు తిలక్, ఆజాద్

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

భారత స్వాతంత్ర్య సమరంలో ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిన మహనీయులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ అని ప్రముఖ వైద్యులు డా. సనపల నర్సింహమూర్తి, మాజీ సైనికుడు బుర్రా ఆదినారాయణ శాస్త్రి పేర్కొన్నారు. గురువారం నగరంలోని శాంతినగర్ కాలనీ గాంధీ మందిరంలో వీరి జయంతి వేడుకలు నిర్వహించి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. చంద్రశేఖర్ ఆజాద్ యువతలో ఉద్యమ స్ఫూర్తి నింపగా, గణేష్ ఉత్సవాల ద్వారా తిలక్ ప్రజలను ఏకం చేశారని కొనియాడారు. అనంతరం పండితులు పైడి హరనాథరావు, నిష్టల నర్సింహమూర్తి దేశభక్తి గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డా. నిక్కు అప్పన్న, జామి భీమశంకర్, నటుకుల మోహన్, నక్క శంకరరావు, చౌదరి రాధాకృష్ణ, మహిబుల్లా ఖాన్, కొమ్ము రమణమూర్తి, పెంకి చైతన్యకుమార్, బుడుమూరు సూర్యారావు, జి. నాగేశ్వరరావు, డా. కుసుమలత, గురువు మురళీ, మాజీ సైనికులు వెంకటరమణ, సువ్వారి రాజారావు పాల్గొన్నారు.



# రేపు ఎమ్మెల్యే గొండు శంకర్ 'ప్రజా గ్రీవెన్స్'

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఈనెల 24న 'ప్రజా గ్రీవెన్స్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నగరంలోని విశాఖ ఏ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలు, అర్జీలను నేరుగా ఎమ్మెల్యేకు అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆయన కార్యాలయం తెలిపింది. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేడర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ట్రాక్ భద్రతపై అవగాహన సదస్సు

**(సత్యంన్యూస్, విజయనగరం)**


దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని విశాఖపట్నం డివిజన్, విజయనగరం ఎడిఈఎన్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో "ట్రాక్ ప్రొటెక్షన్", "వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశాలపై గురువారం భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బోహ్రా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రైళ్ల సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, ట్రాక్ రక్షణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైలు సర్వీసుల సురక్షిత నిర్వహణ, సమయపాలనలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాక్ నిర్వహణ సిబ్బంది సమర్పణ భావాన్ని, కష్టపడే తత్వాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విధుల నిర్వహణలో రక్షణను పెంచేందుకు 30 మంది మహిళా ట్రాక్‌మన్లకు బాడీ వార్న్ కెమెరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డెన్ (ఈస్ట్) కె. నవీన్ రాజు, సీనియర్ డెన్ (సౌత్) సాయిరాజ్, సీనియర్ డెన్ (కోఆర్డినేషన్) రాజీవ్ కుమార్, సీనియర్ డీఓఎం డాక్టర్ ఎమ్. శ్రవణ్ కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ దీపాంశు శర్మ, విజయనగరం ఏఈఎన్ గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.




# ప్రత్యామ్నాయ చట్టం కోసం వినతి


**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల విద్యా, ఉద్యోగ, భూమి హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వాబ యోగి మాట్లాడుతూ.. రాష్ట్ర వైశాల్యంలో కేవలం 4.6 శాతంగా ఉన్న ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలోనే 100 శాతం ఉద్యోగ నియామకాల రక్షణ అడుగుతున్నామని స్పష్టం చేశారు. గతంలో ఉన్న జీవో నంబర్ 3 పరిపాలనా ఉత్తర్వు మాత్రమే కావడంతో సుప్రీంకోర్టు కొట్టివేసిందని, దాని స్థానంలో అసెంబ్లీ ద్వారా 'ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం' తెచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. అలాగే 1/70 చట్టం రద్దుపై వేసిన పిటిషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన కౌంటర్ దాఖలు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్.. గిరిజన సంక్షేమ శాఖల కార్యదర్శులకు తక్షణమే నోటీసులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు గణేష్, వాసు పాల్గొన్నారు.



# ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు రేపే ఆఖరు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**




ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు సమర్పించేందుకు జూలై 24 (శుక్రవారం) చివరి రోజని టీడీపీ అధికార ప్రతినిధి పి.ఎం.జె. బాబు తెలిపారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 2,358 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న 18,97,405 మంది ఓటర్లలో ఇప్పటికే 17,27,178 మంది ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇంకా 1,70,227 మంది అందుబాటులోకి రాలేదని వెల్లడించారు. ఫారాలు ఇవ్వని వారు వెంటనే బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఆగస్టు 30 వరకు మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తారని, అక్టోబర్ 3న విడుదలయ్యే తుది జాబితా ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అర్హులందరి పేర్లు నమోదయ్యేలా టీడీపీ శ్రేణులు, బీఎల్‌ఏలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఇనాం భూముల వేలం ఆపాలి

**(సత్యంన్యూస్, జి.సిగడాం)**

మండలంలోని ఎన్‌జీఆర్‌పురం రెవెన్యూ పరిధిలోని మాన్సాస్ ట్రస్ట్ ఇనాం భూముల వేలంపాటను తాత్కాలికంగా నిలిపివేసి, తమకు తగిన గడువు కల్పించాలని గుర్రాలపాలెం రైతులు స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కోరారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యేను కలిసిన రైతులు ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న ఈ భూములను బహిరంగ వేలంలో పాల్గొని కొనుగోలు చేసేందుకు వీలుగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమయం ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధితులకు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



**'సత్యం' సినిమా**

# తాత ప్లాన్‌తోనే జయకృష్ణ ఎంట్రీ!

ఘట్టమనేని కుటుంబం నుంచి హీరోగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం సాధారణ విషయం కాదు. సూపర్ స్టార్ కృష్ణ వారసత్వంగా వచ్చే ప్రతి ఒక్కరిపై ప్రేక్షకులకు భారీ అంచనాలు ఉంటాయి. ఈ క్రమంలో తన తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' ప్రమోషన్ల సందర్భంలో నటుడు జయకృష్ణ తన జీవితంలో చోటుచేసుకున్న ఒక భావోద్వేగ ఘట్టాన్ని గుర్తుచేసుకున్నారు. తన తండ్రి రమేష్ బాబు మరణం తర్వాత తాత కృష్ణ చెప్పిన మాటలే తన సినీ జర్నీకి బలమైన పునాదిగా నిలిచాయని ఆయన వెల్లడించారు.

తండ్రి రమేష్ బాబు మరణించిన 15 రోజుల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత, తాతయ్య కృష్ణ తనను దగ్గరకు పిలిచి దాదాపు అరగంట పాటు మాట్లాడారని జయకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు జీవితం ఒక ఎత్తు అయితే, ఇకపై ఏ దారిలో వెళ్లాలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారని చెప్పారు. ఘట్టమనేని కుటుంబం నుంచి రావడం అంటే చిన్న విషయం కాదని, కేవలం ప్రయత్నం చేస్తున్నాననే భావనతో కాకుండా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించినట్లు పేర్కొన్నారు. నీలో హీరోకి కావలసిన అన్ని లక్షణాలు ఉన్నాయని ధైర్యం చెప్పి, అమెరికా వెళ్లి యాక్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు.

తాతయ్య మాటలను తీవ్రంగా పరిగణించిన జయకృష్ణ, వెంటనే అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌కు వెళ్లి యాక్టింగ్, డ్యాన్స్, ఫైట్స్‌లో శిక్షణ పొందారు. అయితే అమెరికాలో చదువుకుంటున్న సమయంలోనే 2022 నవంబర్‌లో కృష్ణ కన్నుమూశారని, వీసా సమస్యల కారణంగా తాతయ్య చివరి చూపుకు కూడా రాలేకపోయానని జయకృష్ణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ బాధ తన జీవితంలో ఎప్పటికీ ఉండిపోతుందని తెలిపారు.

**తెలుగు సినీ చరిత్రలో కౌబాయ్ చిత్రాలు, ఈస్ట్‌మన్ కలర్, 70 ఎంఎం వంటి ఎన్నో సాంకేతిక విప్లవాలను పరిచయం చేసిన సూపర్ స్టార్ కృష్ణ వారసత్వాన్ని మూడో తరం సభ్యుడిగా ముందుకు తీసుకెళ్లేందుకు జయకృష్ణ సిద్ధమయ్యారు. దివంగత రమేష్ బాబు కుమారుడైన ఈయన కథానాయకుడిగా నటించిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం 2026 జూలై 30న విడుదల కానుంది. తండ్రి లేని లోటులో తాత ఇచ్చిన ధైర్యంతో, అదే ప్లాన్‌తో అడుగుపెడుతున్న జయకృష్ణ ఘట్టమనేని వారసత్వాన్ని ఏ స్థాయిలో నిలబెడతారో వేచి చూడాలి.**





# వైట్ డ్రెస్‌లో దేవకన్యలా 'ఇస్మార్ట్' భామ!!

టాలీవుడ్ అందాల భామ నిధి అగర్వాల్ తన గ్లామరస్ లుక్స్‌తో సోషల్ మీడియాలో మరోసారి రచ్చ చేస్తోంది. నిత్యం రకరకాల ఫోటోషూట్‌లతో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన పిక్స్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి డిజైనర్ లెహంగా చోలీలో దేవకన్యలా, వైట్ సిండ్రెల్లాలా మెరిసిపోతున్న ఆమె ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో రాయల్ ఎలిగెన్స్, మోడర్న్ స్టైల్ కలబోతగా నిధి కనిపించింది. ముత్యాలు, సీక్విన్స్, మెరిసే ఎంబ్రాయిడరీ వర్క్‌తో రూపొందించిన తెల్లటి లెహంగా చోళీకి మ్యాచింగ్ పారదర్శక దుపట్టా జతచేసి క్లాసీ లుక్‌ను సొంతం చేసుకుంది. దానికి తగ్గట్టుగానే పింక్ మరియు గ్రీన్ కలర్ స్టోన్స్ ఉన్న హెవీ చోకర్ నెక్లెస్, మ్యాచింగ్ కమ్మలు ధరించి రాయల్ వైబ్స్ అందించింది. లైట్ మేకప్, లూజ్ హెయిర్‌స్టైల్, నుదుటిన చిన్న బొట్టు ఆమె సాంప్రదాయ లుక్‌ను మరింత హైలైట్ చేశాయి.

అక్కినేని నాగార్జున సమర్పణలో వచ్చిన 'సవ్యసాచి' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నిధి, రామ్ పోతినేని సరసన నటించిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మాస్ ఆడియన్స్‌కు బాగా దగ్గరైంది. ఆ తర్వాత తమిళంలో 'ఈశ్వరన్', 'కలగ తలైవన్', 'హీరో' వంటి సినిమాల్లో నటించి కోలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో నటించి అలరించింది.

ప్రస్తుతం సోషల్ మీడియా ఫోటోషూట్‌లతో నిత్యం వార్తల్లో నిలుస్తున్న ఈ భామ, తన తదుపరి ప్రాజెక్టుల ప్రకటనలను త్వరలోనే వెల్లడించనుందని తెలుస్తోంది. గ్లామర్‌తో పాటు నటనతోనూ మెప్పించే నిధి అగర్వాల్ త్వరలోనే మంచి హిట్ సినిమాతో బిగ్ స్క్రీన్ పై మళ్లీ సందడి చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# వణుకుతోంది పసిపిల్లలు కాదు... ఆ కుర్చీల్లో కూర్చున్న పెద్దలే



(మొదటిపేజీ తరువాయి)

కళ్లు తుడుచుకుంటూ, అబ్బురపడుతూ, జాగ్రత్త చెపుతూ వేల చేతులతో వారిని పొదువుకోవాలని ఉంది. **తలలు పగులుతున్నా, కాళ్లూ చేతులూ దోక్కుపోతున్నా, ఒళ్లంతా లాఠీ దెబ్బలతో కదుం కడుతున్నా.. పోలీసులతో ప్రభుత్వంతో అంత శాంతంగా ఎలా చర్చలు చేస్తున్నారు?** ఆ పిల్లల తెలివి, పక్కవారి పట్ల అక్కర, పట్టుదల, నిర్భీతి, అంతేకాదు వారి చమత్కారం- ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేస్తే రెండు కళ్లూ చాలడం లేదు. **లాఠీ దెబ్బలకు ఎదురొడ్డి నిలబడిన ఆ చేతులు, రేపు ఈ భారతావని నిర్మాణంలో భాగస్వామ్యమయ్యే చైతన్యవంతమైన శక్తులు. ప్రశ్నిస్తున్న యువతను.. వారి నిరసనను మీరు సమర్థించకపోయినా పరవాలేదు, కానీ కనీసం మానవత్వంతో వారి ప్రజాస్వామిక హక్కును, అనుభవిస్తున్న ఆవేదనను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత.**

**నా మిత్రుడు దుప్పల రవికుమార్ తన ఫేస్‌బుక్ వాల్ మీద ఉంకించిన మాటల్నే కొంచెం వాడుకుంటున్నాను.** ఇంతవరకు ఉన్న ఒక సన్నని గీత చెరిగిపోయింది. జంతర్ మంతర్ దగ్గర జరిగిన సంఘటనలు మన దేశంలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్యనున్న ఉల్లిపొరలాంటి తెరను చీల్చేసాయి. పోలీసులను ఆయుధాలుగా చేసుకుని యువతను కర్కశంగా కొట్టిన మన ప్రభుత్వం తన మేలి ముసుగులన్నీ తీసేసుకుంది. ప్రపంచం ముందు తన వికృత నగ్న స్వరూపాన్ని చూపిస్తూ నిల్చుంది.

**ఒక క్రమ పద్ధతిలో ఓటర్ల లిస్టు తారుమారు చేసి ఒక్కొక్కటిగా రాష్ట్రాలను ఆక్రమించారు. రాహుల్ బయటపెట్టాక మనం నోరెళ్లబెట్టాం. ఇప్పుడు పరకాల ప్రభాకర్ గొంతెత్తి గోల పెడుతున్నా మనలో చలనం లేదు. మనం ఎవరికి ఓటేసినా అది అతడికే పడడం, ఆ రాత్రే ఈవీఎంలు కాలిపోవడం, వివిప్యాట్ స్లిప్పులు తగలేయడం.. అకౌంటబిలిటీ లేని దుస్థితికి వచ్చేసాం. ఇదొక అప్రకటిత ఎమర్జెన్సీ..**

ముందు మహిళలు సీఏఏ కోసం ఉద్యమించినప్పుడు వారివైపు ఆశగా చూసాం. రైతులు దాదాపు రాజధానిని ముట్టడించబోయారు. అన్నం పెట్టే రైతే దేశాన్ని కాపాడతాడనుకున్నాం. ఇప్పుడు ఆశ పిల్లల మీదకు మళ్లించుకున్నాం. వాళ్లను చూస్తే ఎంత ముచ్చటేస్తుందో.. అహింసాయుతమైన పోరాటం, ఎక్కడా మాట తూలకపోవడం, స్పష్టమైన లక్ష్య నిర్దేశనం.. ఇంత నిరాశామయ వాతావరణంలో కూడా ఆశలు మోసులెత్తించే యువత.. అద్భుతం.. వీరే మనకు ప్రాణవాయువు. ఇది రాజకీయ పార్టీల పోరాటం కాదు.. దేశ యువత బతుకులను కాపాడుకునే ధర్మయుద్ధం. అధికార, ప్రతిపక్షాల హద్దులు దాటి గళమెత్తుతున్న ఆ యువతకు మన మద్దతు అత్యవసరం. యువత గొంతు నొక్కితే ప్రజాస్వామ్యమే ప్రశ్నార్థకమవుతుంది.

రాజకీయ కక్షలు, లెక్కల కంటే జాతి భవిష్యత్తు ముఖ్యం. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువతపై దమనకాండ ప్రజాస్వామ్య స్ఫూర్తిని చంపేయడమే. **స్కూల్ బ్యాగులు వేసుకున్న 16 ఏళ్ల ఆడపిల్లల్ని రోడ్డు మీద ఈడ్చుకుంటూ కొట్టడానికి సిగ్గులేదా? చదువు, భద్రత కోసం గళమెత్తితే వాళ్లు మీకు దేశద్రోహులుగా కనిపించారా? పన్నెండో తరగతి పిల్లలు కదా అని లాఠీలతో భయపెట్టాలని చూశారు. బట్టలు చించి దాడులు చేసిన పోలీసుల అహంకారాన్ని ఆ అమ్మాయిలు తుత్తునియలు చేశారు.** ఈ చెడిపోయిన వ్యవస్థే మా భవిష్యత్తు కాకూడదంటూ వారు వేసిన ప్రశ్నలకు అధికార పీఠం కదిలింది. ఏ నాయకుడి ప్రసంగం చేయలేని పనిని ఆ పిల్లలు చేసి చూపించారు.

**అధికారం చేతిలో ఉందని విర్రవీగుతున్నారు కానీ, నిజానికి ఇక్కడ భయంతో వణుకుతోంది పసిపిల్లలు కాదు... ఆ కుర్చీల్లో కూర్చున్న పెద్దలే. నీట్ పరీక్ష రాసిన వారిలో చాలా మంది హిందువులే. పేపర్ లీక్ అయిందని బాధపడిన వారిలో అధికంగా హిందువులే. ఆ కారణంగా చనిపోయిందీ హిందువులే. వారి కోసం ధర్నా చేస్తున్నదీ అధికంగా హిందువులే. ధర్నా చేస్తున్న వారి పైన లాఠీఛార్జ్ చేయమని చెప్పిందీ హిందువులే. ఇది హిందువుల కోసం ఉన్న ప్రభుత్వం అని భ్రమపడేదీ హిందువులే. తెలుగునాట తెలియడం లేదుగానీ క్రాకోచ్ కలవరపెడుతోంది కమలాన్ని.**

దేశం అప్పుల్లో కూరుకుపోతున్నా, మతం పేరు చెప్పి నిధులు, ఓట్లు దోచుకుంటున్నా, తయారీరంగంలో, ఏఐలో వచ్చిన అవకాశాలు జారవిడుచుకున్నా, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నా, విద్య నుంచి ఎన్నికల సంఘం వరకు అన్నీ దిగజారిపోతున్నా, రకరకాల పన్నులతో ప్రజల జేబులో ఉన్న ఆఖరి రూపాయి కూడా లాగేసుకున్నా కేవలం దేశం మీద ప్రేమతో నోరెత్తకపోవడం ఒక రకమైన దేశభక్తి.

**ఈ దేశాన్ని దారిలో పెట్టుకోవాలి, అన్నిటినీ సరి చేయాలి, నా భవిష్యత్తు, నా పిల్లల భవిష్యత్తు కాపాడుకోవాలి అని రోడ్డెక్కి టియర్ గ్యాస్, లాఠీ దెబ్బలు తింటూ, గట్టిగా రోదిస్తూ 'నన్ను ఇంకా కొట్టండి సార్ కానీ నా దేశాన్ని బాగుచేయండి' అని పోరాడుతున్న వారిది మరొక రకమైన దేశభక్తి.** నీకు ఎవరిది సరైనది అనిపిస్తే వారి వైపు నిలబడు, అంతేకానీ ఒకరిది తప్పు, మరొకరిది రైటు అని తీర్పులు ఇవ్వవద్దు. ఎవరి దృక్కోణం వారిది!

దేశ రాజధాని వీధుల్లో తమ భవిష్యత్తు కోసం గొంతెత్తిన యువత ఆక్రోశం ఈనాడు సమాజపు ఆత్మసాక్షిని తట్టవలసిన సమయం. జంతర్ మంతర్ వద్ద ఆకలి – దాహాలను దిగమింగుకుని, శరీరం సహకరించకపోయినా తమ ఆశయం కోసం పడికాపులు కాసిన ఈ తరం ఆవేదనను తేలిగ్గా కొట్టిపారేయలేము. నిరసనను అణచివేసే క్రమంలో ఏర్పడిన కట్టుదిట్టాలు వారి ప్రాథమిక మానవ అవసరాలను కూడా హరించివేశాయి. కనీసం మూత్ర విసర్జన చేసుకోవడానికి కూడా వీలులేని పరిస్థితులు, ఒంటిపై పడ్డ లాఠీ దెబ్బలు, శారీరక హింస.. ఇంకో పక్క ఆకలితో పాటు అడుగడుగునా ఎదురవుతున్న అవమానాలను భరిస్తూ కూడా ఆ యువత వీధుల్లో నిలబడింది.

ప్రజాస్వామ్యంలో విభిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే. ఆ కోణంలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఉద్యమాన్ని ఎవరైనా సమర్థించకపోవచ్చు లేదా వారితో ఏకీభవించకపోవచ్చు. కానీ, శారీరక యాతనను భరిస్తూ తమ భావి పరిరక్షణ కోసం పోరాడుతున్న వారి ఉద్యమ స్ఫూర్తిని, నిరుపమాన త్యాగాన్ని గుర్తించకపోవడం ఘోరమైన అపరాధం. ఎదుటివారి భావప్రకటనా స్వేచ్ఛను, నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కును అంగీకరించకపోగా... అసత్యాల ముసుగులో యువత పోరాటాన్ని కించపరచడం అత్యంత విచారకరం.

**సకల సౌకర్యాలు ఉన్న గదుల్లో కూర్చుని, వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియా వేదికగా చల్లే ఫేక్ సమాచారం తీవ్రమైన హాని కలిగిస్తోంది. ఈ అబద్ధపు ప్రచారాలు.. లాఠీ దెబ్బల గాయాలను దిగమింగుకుని నిలబడ్డ యువత ఆశయాన్ని వెక్కిరిస్తున్నాయి.. దెబ్బలు తింటున్న తమ బిడ్డలను చూసి కంటనీరు పెట్టుకుంటున్న తల్లిదండ్రుల ఆవేదనను గాయపరుస్తాయి.** తమకు జరిగిన అన్యాయాన్ని దిద్దుబాటు చేయాలని పోరాడుతున్న యువతను రాజకీయ లబ్ధి కోసం అణచివేయడం, లేదా అబద్ధాల ముద్రలు వేసి దోషులుగా నిలబెట్టడం ప్రజాస్వామిక విలువలకే గొడ్డలిపెట్టు. సత్యాన్ని దాచొచ్చు.. కానీ శాశ్వతంగా ఓడించలేరు.



# ట్రిపుల్ మర్డర్‌కు ఏఐ సహకారం!

(మొదటిపేజీ తరువాయి)

సోమసుందర్(55), ముత్తులక్ష్మి(48) దంపతులు ఇద్దరు కుమార్తెలు.. శ్వేత(24), సుప్రియ(20)లతో కలిసి నివాసం ఉంటున్నారు. శ్వేత ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నది. అక్కడే ఆమెకు కెన్నెత్(25) అనే వ్యక్తితో పరిచయం అయ్యింది. ఆ పరిచయం పెరిగి సహజీవనం చేసే వరకు వెళ్లింది. ఇది శ్వేత తల్లిదండ్రులకు ఏమాత్రం ఇష్టం లేదు. తరచూ గొడవలు జరిగేవి. దాంతో వారిద్దరూ రెండు నెలల నుంచి సీగేహళ్లిలోని సాయిగ్రీన్ అపార్ట్‌మెంటులో వేరుగా ఉంటున్నారు. పైగా వాటికి ఆర్థిక వ్యవహారాలు తోడయ్యాయి. శ్వేతతో కెన్నెత్ క్లౌడ్ కిచెన్ వ్యాపారం పెట్టించాడు. దానికి పెట్టుబడుల కోసం సుమారు రూ.50 లక్షల వరకు బ్యాంకుల నుంచి అప్పు తీసుకున్నారు. అయితే వాటికి ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకులు నోటీసులు పంపాయి. అవి వారి నివాసానికి కాకుండా శ్వేత తల్లిదండ్రుల ఇంటికి వెళ్లడంతో వారు ఆగ్రహానికి గురై శ్వేత, కెన్నెత్‌లను నిలదీశారు. ఫలితంగా గొడవలు ముదిరాయి. ఈ నేపథ్యంలో తమ స్వేచ్ఛకు తల్లిదండ్రులు అడ్డుపడుతున్నారని భావించిన శ్వేత, కెన్నెత్ వారిని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్లాన్ ప్రకారం జూన్ 22న రాత్రి వారిని తాము నివసిస్తున్న అపార్ట్‌మెంటులోనే హత్య చేసి పారిపోయారు. వారి దాడిలో ముత్తులక్ష్మి, సుప్రియ స్పాట్‌లోనే చనిపోగా.. తీవ్రంగా గాయపడిన తండ్రి సోమసుందర్ ఆర్తనాదాలు చేస్తూ కిందవరకు వెళ్లి.. చుట్టుపక్కలవారి సాయంతో ఆస్పతిలో చేరిన తర్వాత మరణించాడు. పరారీలో ఉన్న శ్వేతను జూన్ 24న, కెన్నెత్‌ను ఆ మరుసటి రోజు పోలీసులు పుదుచ్చేరిలో అదుపులోకి తీసుకున్నారు. వారిని తీసుకొచ్చి విచారించినప్పుడు ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగులోకి వచ్చాయి.


**ఆరునెలలుగా చాట్‌బాట్‌తో మంతనాలు**

గతంలో ఒక బ్రేకప్, సాంఘిక బహిష్కరణ వంటి అనుభవాలతో క్రిమినల్ మెంటాలిటీని అలవర్చుకున్న కెన్నెత్ తాజా వ్యవహారంలో క్రూరంగా ఆలోచించాడు. తమ సహజీవనాన్ని వ్యతిరేకించడమే కాకుండా బ్యాంకు అప్పుల విషయంలో తమను నిలదీసి అడుగడుగునా అడ్డుతగులుతున్న శ్వేత కుటుంబాన్ని అంతం చేయడమే మార్గమనుకున్నాడు. తన సహజీవన సహచరిని కూడా ఆ మాయలో ముంచి తల్లిదండ్రులు, చెల్లెలిని అంతం చేసేందుకు సహకరించేలా చేశాడు. తన పన్నాగాలకు గూగుల్ జెమినీ ఏఐ చాట్‌బాట్ సలహాలతో పదును పెట్టాడు. హత్యలకు ముందు ఆరునెలల నుంచి ఇదే అంశంపై చాట్‌బాట్‌తో చాటింగు చేస్తూ సలహాలు తీసుకున్నట్లు విచారణలో తేలడంతో పోలీసులే నిర్ఘాంతపోయారు. చాట్‌బాట్‌తో చాటింగ్ చేసిన తీరు కూడా కెన్నెత్ చావు తెలివితేటలకు నిదర్శనంగా చెబుతున్నారు. నేను హత్య చేయడం ఎలా? లేదా శవాన్ని ఎలా మాయం చేయాలి? అని అడగలేదు. 'ఒకవేళ హత్య చేయడం వంటి పరిస్థితుల్లో చిక్కుకుంటే నేనేం చేయాలి?, 'ఇంట్లో దొంగలు చొరబడితే వారిపై ఎలా దాడి చేయాలి?, కళ్లలో కారం చల్లి, పొడవడానికి ఆయుధాలు ఎలా వాడాలి? అంటూ ఊహాజనితమన్న భ్రమ కల్పించేలా ప్రశ్నలు వేస్తూ క్రమంగా తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టుకున్నాడు. హత్యానంతరం తమ క్లౌడ్ కిచెన్ వ్యాపారం కోసం తయారు చేయించిన ఐరన్ ఫర్నెస్ (ఇనుప కొలిమి)లోనే మృతదేహాలను తగలేసి మాయం చేయాలని మొదట పథకం వేశాడు. కానీ ఏఐ చాట్‌బాట్‌తో చర్చించి, దాని పర్యవసానాలను అంచనా వేసుకున్న తర్వాత అది సాధ్యం కాదని గ్రహించి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. ఆ తర్వాత ఏఐ సాయంతోనే హత్య చేసే పద్ధతులు, తర్వాత రక్తపు మరకలను శుభ్రం చేయడం, ఇతర ఆధారాలు మాయం చేయడం, మృతదేహాల తరలింపు వంటి అంశాలపై తన కుట్రలకు మరింత పదును పెట్టాడు.

**ముగ్గురినీ ఒకేసారి చంపడమే అనూహ్యం**

అయితే అందరినీ ఒకేసారి అంతం చేయాలనుకోలేదు. మొదట జూన్ 22న పక్కా స్కెచ్‌తో శ్వేత తల్లి ముత్తులక్ష్మిని తమ అపార్ట్‌మెంట్‌కు పిలిపించి దారుణంగా పొడిచి చంపాడు. కానీ కొద్దిసేపటికే ఊహించని విధంగా సోమసుందర్, సుప్రియలు కూడా రావడంతో వారిపై కూడా విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో మరణించిన సోమసుందర్ ఇచ్చిన మరణ వాంగ్మూలం ఈ కేసులో కీలకంగా మారింది. సాధారణ కేసుల్లా కాకుండా ఈ కేసును డిజిటల్ దర్యాప్తు చేయాల్సిరావడం పోలీసులకు సవాలుగా మారింది. క్రైమ్ ప్లానింగ్‌లో ఏఐ పాత్రను ఆధారాలతో నిరూపించడానికి కెన్నెత్ ఉపయోగించిన జెమిని చాట్ హిస్టరీ ఇవ్వాలని పోలీసులు ఇప్పటికే గూగుల్‌కు లేఖ రాశారు. నేర పథకరచనలో చాట్‌బాట్‌ను ఏ స్థాయిలో ఉపయోగించాడో నిరూపించడానికి విచారణాధికారులు ఒక దశలో ఏఐ చాట్‌బాట్‌ను కూడా సహ నిందితురాలిగా చేర్చాలని ఆలోచించారంటే ఈ కేసు లో దాని పాత్ర ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే చాట్‌బాట్‌కు చట్టపరమైన బాధ్యత ఏమీ లేదని పోలీసులే చెబుతున్నారు.

# సీదిరి అరెస్టులో చట్టం ఎంత? రాజకీయం ఎంత?


రాజీపత్రం
2026 వ సంవ[illegible] నెల 11వ తేదిన
వ్రాయించుకున్నవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పలాస పోస్టు, పురుషోత్తపురం గ్రామం,సూదికొండదరి కాపురస్తులు దుబ్బ లేటు దానయ్య గారి భార్య దుబ్బ ద్రౌపతి గారికి,
వ్రాయించి యిచ్చినవారు : శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కాశీబుగ్గ పోస్టు, కాశీబుగ్గ గ్రామం,తిలక్ నగర్ కాపురస్తులు సురేంద్ర నారాయణ త్యాడి గారి కుమారుడు సిద్ధార్థత్యాడి గారు వ్రాయించియిచ్చిన రాజీ పత్రం.
(II) నా తాలూకా హంటర్ బులెట్ నెం. AP40AS9994 రు,వాహనం రామక్రిష్ణాపురం నుండి కాశీబుగ్గ వస్తున్న సమయంలో సుమారు రాత్రి 10.00 గంటలకు దుబ్బ దానయ్య తండ్రి లేటు కర్రెయ్య అనే అసామీ తన ఇంటికి వస్తూయుండగా మరల ముందుకు వెళ్ళి వెనక్కి రావడంలో ఈ బులెట్ బండి అదుపు తప్పి అతని పైకి దూసుకు వెళ్ళిపోయింది. అక్కడి అక్కడే అతను మరణించాడు. సదరు విషయములు ఇరువర్గాలు పెద్ద మనుష్యుల సమక్షంలో చర్చించగా పెద్దలు తీర్మాణము ప్రకారము చనిపోయిన వ్యక్తి మరల రారు అని తెలుసుకొని అతని భార్య దుబ్బ ద్రౌపతికి రూ॥ 8,50,000/- (అక్షరాల ఎనిమిది లక్షల యాభై వేల రూపాయలు) లు నా నుండి ఆమెకు చెల్లించుటయే ఉత్తమమని యోచించడమైనది. పెద్దల తీర్మాణము ప్రకారము మొదట నగదుగా రూ॥ 1,50,000/-లు (అక్షరాల ఒక లక్ష యాభై వేల రూపాయలు) ఈ దినమే చెల్లించుటకు అంగీకారము. మిగతా రూ॥ 7,00,000/-లు (అక్షరాల ఏడు లక్షల రూపాయలు) లకు హామీగా పైల వేణుగోపాలరావు చెక్‌లు ఇవ్వడమైనది. ఆ సొమ్మును పది రోజుల్లోగా నేను మీకు చెల్లించిన వెంటనే మీరు పోలీస్ స్టేషన్‌లో పెట్టిన రిపోర్టును పెద్దల సమక్షంలో విరమించుకోగలరు. భవిష్యత్‌లో ఈ విషయము పై ఒకరిపై ఒకరము ఎన్నటికి కక్ష చర్యలకు పాల్పడము. ఇది నా సమ్మతితో వ్రాయించియిచ్చిన రాజీ పత్రం.
1)
సాక్షులు 1)
2)
దీనికి అంగీకరించితిని


దానయ్య కుటుంబంతో సిద్ధార్థ్ త్యాడీ కుదుర్చుకున్న పెద్దమనుషుల ఒప్పంద రాజీ పత్రం.

(మొదటిపేజీ తరువాయి)

లభించలేదు. సిద్ధార్థ త్యాడి అనే యువకుడికి చెందిన వాహనాన్ని నడుపుతూ అప్పలరాజు తనయుడు ఆరవవర్మ గొర్రెల కాపరి దానయ్యను ఢీకొట్టడంతో స్పాట్‌లోనే దానయ్య మరణించిన తర్వాత ఈ కేసు అనేక మలుపులు తీసుకుంది. అయితే ఇందులో తెలుగుదేశం పార్టీగాని, లేదా సోషల్‌మీడియా గాని చెబుతున్నట్టు అనేక అప్పలరాజు వైపు నుంచి అనేక తప్పులు జరిగివుండొచ్చు. అయితే ఇందులో ఉద్దేశపూర్వకంగా దానయ్య మృతికి అటు అప్పలరాజు తనయుడు గాని, ఇటు సీదిరి అప్పలరాజు గాని ఎలా కారకులవుతారో భవిష్యత్తులో న్యాయస్థానంలో ఎస్టాబ్లిష్ చేయడంలో ఏమేరకు అందరికీ తెలుసు. ఇక్కడ యాక్సిడెంట్ జరిగిన మాట వాస్తవం. దానయ్య చనిపోవడం అంతకు మించిన వాస్తవం. ప్రమాదానికి కారకుడైన కొడుకును అప్పలరాజు ఆసుపత్రికి పట్టుకెళ్లి చికిత్స చేయించడం అందరికీ తెలిసిన నిజం. ఇంతవరకు ఎవరూ కాదనలేరు. కాకపోతే బైక్ యజమాని సిద్ధార్థ్ త్యాడి ఈ ప్రమాదానికి కారకుడని పోలీసులు ఆయన్ను స్టేషన్‌కు తీసుకువెళ్లడం, రోడ్డు ప్రమాదం కింద కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టడంపై ఇప్పటికే టీడీపీ శ్రేణులు మాట్లాడాయి. బహుశా అందుకే అక్కడ ఎస్ఐలు, సీఐలు ఇద్దర్నీ వీఆర్‌కు పంపించారు. రోడ్డు ప్రమాదం జరిపింది అప్పలరాజు తనయుడేనని సీసీ ఫుటేజ్‌ల ద్వారా బయటకు వచ్చేలా చేసింది టీడీపీ నాయకులే.. తప్పులేదు. అయితే ఇందులో కావాలనే దానయ్యను బండితో గుద్ది చంపేశారనడానికి ఉన్న ఆధారాలేమిటనేదే వైకాపా నాయకులు అడుగుతున్న ప్రశ్న. అలాగే కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్లి ట్రీట్మెంట్ చేయించారు తప్ప సంఘటన స్థలంలో ప్రమాదం జరిగిందన్న ఆనవాలు చెరిపేయడం గాని, సీసీ టీవీ ఫుటేజ్‌ను డెలిట్ చేయించడం గాని అప్పలరాజు చేశారా? అంటే సమాధానం చెప్పేవారు అక్కడ లేరు. కొడుకుకు ట్రీట్మెంట్ ఇప్పించి, ఊరు దాటించే ప్రయత్నం చేశారంటున్నారే తప్ప దానయ్యను చంపాల్సిన అవసరం ఎందుకొచ్చిందో ఎవరూ చెప్పడంలేదు. ఇక అప్పలరాజు తనయుడు స్థానంలో సిద్ధార్థ్ త్యాడీ అనే యువకుడ్ని బలి తీసుకుందామని చూశారన్న వాదన బలంగా వినిపిస్తోంది. అసలు ప్రమాదం చేసిన వాహనం సిద్ధార్థ్ త్యాడీ పేరు మీదే ఉంది. త్యాడీ తండ్రి అప్పలరాజు గూటిలో ఉన్న పక్షి. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సీబుక్, లైసెన్స్ ఉన్నవారి పేరుతో కేసు నమోదైతేనే ఇన్సూరెన్స్ వస్తుంది. బహుశా పోలీసులు మొదట్లో ఆ కోణంలోనే త్యాడీ మీద కేసు నమోదుచేసి, అన్ని యాక్సిడెంట్ కేసుల్లాగే స్టేషన్ బెయిల్ ఇచ్చేశారు. దీనికి తోడు స్వయంగా తెలుగుదేశం నాయకులే చనిపోయిన దానయ్య కుటుంబానికి, రోడ్డు యాక్సిడెంట్ తానే చేశారంటూ స్టేషన్‌కు వెళ్లిన సిద్ధార్థ్ త్యాడి మధ్య సొమ్ములు ముట్టజెప్పే ఒక అగ్రిమెంట్‌ను కుదుర్చారు. దీంతో ఈ కేసు అక్కడితో ముగిసిపోయిందనుకున్నారు పోలీసులు. కానీ ఎప్పుడైతే అప్పలరాజు కొడుకు దీనికి కారకుడని తెలిసిందో ఈ కేసు మామూలు టర్న్ తీసుకోలేదు. ఒప్పందం కుదిర్చిన పెద్దలే కులానికి నేతృత్వం వహిస్తూ ర్యాలీలు తీశారు. అప్పలరాజు కొడుకును రిమాండ్‌కు పంపిన తర్వాత సీదిరిని కూడా ఎలా లోపలేయాలన్నదానిపై రాజకీయ చదరంగంలో పావులు చకచకా కదిలాయి.

రోడ్డు ప్రమాదంలో దానయ్య చనిపోవడానికి కారణం సిద్ధార్థ్ త్యాడీ కాదని, సీదిరి తనయుడు ఆరవ్ వర్మ కారకుడని పోలీసులు అప్పలరాజుకు చెప్పివుంటే ఆ తర్వాత కూడా కొడుకును తప్పించడానికి సీదిరి ప్రయత్నాలు చేసి త్యాడీని ఇరికించివుంటే కచ్చితంగా అది క్రైమ్. లేదా దానయ్య మరణాన్ని దాచేసి అసలు అటువంటిది జరగలేదని బుకాయిస్తే అది ఇంకా పెద్ద నేరం. కానీ ఆరవ్ ఫోన్ నుంచే సంఘటన స్థలం నుంచి 108కు ఫోన్ వెళ్లింది. ఇక సీసీ టీవీలు ప్రైవేట్ వ్యక్తులవే అయినా అందులో ఫుటేజ్ ఏమాత్రం పోలేదు. ఇందులో హత్య కోణం ఎక్కడుందో అర్థం కావడంలేదు. అక్కుపల్లి జంక్షన్‌లో శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్ నుంచి జులై 10న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తీసిన ఫుటేజ్ మేరకు బండి డ్రైవింగ్ సీటులో ఉన్నది ఆరవ్ వర్మ.

అప్పలరాజు మంత్రిగా ఉన్నప్పుడు పలాస నియోజకవర్గంలో తెలుగుదేశం శ్రేణులు సఖ్యంగానే ఉన్నాయి. గౌతు కుటుంబాన్ని నమ్ముకున్న కొందరు తప్ప మిగిలినవారు ఆయన ప్రాపకం కోసం తహతహలాడారు. చాలామంది పార్టీ మారి పనులు చేయించుకుంటే, కొందరు పార్టీలో ఉంటూనే ఆయన్నుంచి లబ్ధి పొందారు. దీంతో పలాసలో టీడీపీ ఉండదన్న భావనతో గౌతు శిరీషను వైకాపా తీవ్రంగా వేధించింది. ఒక మహిళ అని కూడా చూడకుండా సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారు. అయినదానికి, కానిదానికి పలాసలో శాంతిభద్రతల సమస్య సృష్టించేవారు. ఇప్పుడు దానికి సమాధానం అప్పలరాజుకు ఇలా దొరికిందని భావించాలి. అప్పలరాజు తనయుడికి ఎల్ఎల్ఆర్ మాత్రమే ఉంది. ఇంక పూర్తిస్థాయి లైసెన్స్ రాలేదు. ఈ కోణంలో ఆయనకు బెయిల్ వచ్చి ఉండకపోవచ్చు. ఇక ర్యాష్ డ్రైవింగ్ చేశాడా? లేదా? అనేది పోలీసులు నిర్ధారించాలి.



టీడీపీ నాయకులు సాక్షి సంతకాలు చేసిన పత్రం

గత ప్రభుత్వ అక్రమాలు

## ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయ్

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. కనీసం రైల్వే స్టేషన్ రోడ్ల వంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకుండా, కేవలం స్వలాభం కోసమే అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

**నకిలీ పత్రాలతో భూకబ్జాలు**

అధికార బలంతో కొందరు నాయకులు చేసిన భూదాహం పరాకాష్టకు చేరిందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. బతికున్న వారిని చనిపోయినట్లు, చనిపోయిన వారి పేరు మీద నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించారని, వీటికి సంబంధించిన పక్కా ఆధారాలు మన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రజాసేవ కోసం వచ్చిన పదవులను అక్రమాలకు వాడుకోవడం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర విరుద్ధమని వ్యాఖ్యానించారు.

**బాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, గతంలో హైదరాబాద్‌ను ఐటీ రాజధానిగా తీర్చిదిద్దిన అనుభవంతో ఇప్పుడు అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, మౌలిక వసతుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూదందాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాదారపు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు పట్నాయక్ శంకర్, రూరల్ మండల అధ్యక్షుడు మూకళ్ల శ్రీనివాస్, గార మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ఏపీఈ డబ్ల్యూఐడీసీ డైరెక్టర్ పీఎంజే బాబుతో పాటు పలువురు పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

Printed, published, and owned by N.V.S.PRASAD, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh. Postal Regn.No: D/RNP/SKLM/12/2026-2028. RNI NO: APTEL No. 2005/17967